



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

- కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై మంగళవారం సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతుల నుంచి ధాన్యం సేకరించాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాలను నిర్వహించాలన్నారు. కేంద్రాల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సన్నరకాలు, దొడ్డురకాల ధాన్యం కొనుగోలుకు వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కేంద్రాల్లో సరిపడ గన్నీబ్యాగులు, టార్పాలిన్స్, ప్యాడీక్లీనర్స్, సంబంధిత ఎలక్ట్రానిక్ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేకాధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని, రవాణా సదుపాయంలో ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, జిల్లా అధికారులు మధూసూదన్‌రాజు, వెంకటేశ్వర్లు, ప్రేమ్‌కుమార్, కృష్ణవేణి, విజయనిర్మల, మరియన్న, మానుకోట, తొర్రూరు ఆర్డీవోలు కృష్ణవేణి, గణేష్ పాల్గొన్నారు.

న్యాయం వైపు జిల్లా యంత్రాంగం ఉంటుంది..

న్యాయం వైపు జిల్లా యంత్రాంగం ఉంటుందని అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నర్మద అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సంక్షేమం కోసం ప్రభు త్వం, అన్ని విభాగాలు పని చేస్తాయని చెప్పారు. మహబూబాబాద్, తొర్రూరు డివిజన్‌ల్లో మొత్తం 46 ఎస్సీ, ఎస్టీ కేసులకు ప్రభుత్వం తరఫున వారికి రూ.11.75 లక్షలు నష్టపరిహారం అందించడం జరిగిందన్నారు. సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ మాట్లాడుతూ పోలీస్ విభాగం తరఫున ఎస్సీ, ఎస్టీలకు అండగా ఉంటామని, గ్రామస్థాయిలో వారిపై దాడులు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో 147 కేసులు నమోదయ్యాయని వివిధ కారణాల వల్ల 22 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈనెల13న ఉదయం 11 గంటలకు ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు జిల్లాకు రానున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నర్మద తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి, అధికారులు సైదానాయక్, వెంకటేశ్వర్లు, మరియన్న, నర్సయ్య, సంజీవరావు, కిషన్‌నాయక్, అశోక్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



వేతనాలు రాక వేతలు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభ్యున్నతి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) రిసోర్స్‌పర్సన్(ఆర్పీ)లకు వేతన వెతలు తప్పడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కొద్దిపాటి వేతనం కూడా నెల నెలా చేతికందకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. గత ఐదు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో పడరాని కష్టాలు పడుతున్నారు. కరోనా క్లిష్ట సమయంలో సైతం మెప్మా ఆర్పీలు తమ ప్రాణాలను లెక్క చేయకుండా వైద్య అంగన్‌వాడీ సిబ్బందితో సమానంగా విధులు నిర్వహించి ఎంతో మంది ప్రాణాలను కాపాడడంతో పాటు ప్రజలు కరోనా బారిన పడకుండా తగిన సూచనలు చేశారు. రోజు రోజుకు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరిగి ఆకాశన్నంటుతున్నప్పటికి వారు మాత్రం నెలకు కేవలం రూ.6వేల వేతనంతో సరిపెట్టుకుంటున్నారు. పెరిగిన ధరల కనుగుణంగా నెలకు కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనం చెల్లించి ప్రతి నెలా క్రమం తప్పకుండా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లో వేతన చెల్లింపులు చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

నాలుగు మునిసిపాలిటీల్లో 89మంది ఆర్పీలు..

మహబూబాబాద్ జిల్లా పరిధిలోని నాలుగు మునిసిపాలిటీలు మానుకోట, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్‌లో మెప్మా ఆర్పీలు ప్రతి నిత్యం ఉదయం నుంచి సాయంత్రం వరకు విధుల్లో తలమునకలవుతున్నారు. జిల్లాలో మొత్తంగా 89మంది ఆర్పీలు పని చేస్తున్నారు. వీరు మునిసిపాలిటీ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడంతో పాటు అందులోని సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలందించి ఆర్థికాభివృద్ధికి పాటుపడుతారు. రుణాలు ఇప్పించి వాటిని రికవరీ చేసి బ్యాంకులకు, మహిళా గ్రూపులకు సంధానకర్తలుగా పని చేస్తున్నారు. ఒక్కో గ్రూపులో దాదాపు 10మంది సభ్యులుంటారు. 20 నుంచి 30 గ్రూపులకు కలిపి ఒక రిసోర్స్‌పర్సన్ ఉంటారు. ఆయా గ్రూపులకు సంబంధించి రుణాలు ఇప్పించడం, రికవరీ చేయడం, సమావేశాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలు, ఆర్థికాభివృద్ధిపై అవగాహన కల్పించడం ఆర్పీల విధి. ఇటీవల కాలంలో ప్రభుత్వ కార్యక్రమాల్లో అన్నింటిలో భాగస్వాములవుతున్నారు. అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ముఖ్య భూమిక పోషిస్తున్నారు. ఓటరు నమోదు, ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ, ప్రస్తుతం కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ, కులగణన సర్వేలో కూడా ఆర్పీలు భాగస్వాములవుతున్నారు.

- ఐదు నెలలుగా మెప్మా ఆర్పీలకు అందని గౌరవ వేతనం
- నాలుగు మునిసిపాలిటీల్లో 89 మంది విధులు
- కరోనా కష్ట సమయంలోనూ వైద్య సిబ్బందితో కలిసి సేవలు
- కనీస వేతనం నెలకు రూ.18వేలు చెల్లించాలని విజ్ఞప్తులు

పోరాటాలతో 2019లో గౌరవ వేతనం..

మునిసిపాలిటీల పరిధిలో పనిచేస్తున్న ఆర్పీలకు తొలుత గౌరవ వేతనం కూడా లేదు. నెలకు కనీస వేతనం రూ.10వేలు చెల్లించాలనే డిమాండ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్పీలు విధులను బహిష్కరించి సమ్మె నిర్వహించడం, వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టడంతో అప్పటి ప్రభుత్వం 15 జనవరి, 2019 నుంచి ఆర్పీలకు నెలకు రూ.4వేల వేతనం నిర్ణయించగా, చెల్లిస్తున్నారు. ఆ తర్వాత మళ్లీ రూ.2వేలను పెంచడంతో ప్రతి నెలకు రూ.6వేల వేతనం అందుతోంది. అయితే వీరి వేతనాలకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతో చెల్లింపులు ఆలస్యమవుతున్నాయి. ఐకేపీ వీవోఏల తరహాలో వేతనాలకు బడ్జెట్‌ను కేటాయించి క్రమం తప్పకుండా ప్రతి నెలా వేతనాన్ని అందించాలని ఆర్పీలు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న మెప్మా ఆర్పీలకు ఐదు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయ బతుకమ్మ, దీపావళి పండుగ సమయాల్లో కూడా వేతనాలు రాకపోవడంతో ఆర్పీలకు పండుగ సమయాల్లో ఆర్థిక తిప్పలు తప్పలేదు. తక్షణమే ఐదు నెలల వేతనం అందించి ఆదుకోవడంతో పాటు ప్రతి నెలా కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పేదలు ఉన్నంత వరకు ఎర్రజెండా ఉంటుంది

సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

గార్ల నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దేశంలో పేదప్రజలు ఉన్నంత వరకు వారి పక్షాన ఎర్రజెండా పట్టుకొని, సీపీఎం పార్టీ సమరశీల పోరాటాలు చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మంగళవారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాకు వ్యతిరేకంగా వామ పక్షాలు కలుపుకొని ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. పోస్టల్, రైల్వే, బొగ్గులాంటి ప్రభుత్వ రంగ సంస్థలను ఒకొక్కటిగా ప్రైవేటు పరం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్రంలో అధికార దాహంతో కాంగ్రెస్ పార్టీ ఇబ్బడి మొబ్బడిగా ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని చెప్పి, అధికారం చేపట్టి 11 నెలలు కావస్తున్నా బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం తప్ప మరి ఏ ఒక్క పథకం సంపూర్ణ అమలుకు నోచుకోలేదన్నారు.



గార్లలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి, కందునూరి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గుండా వెంకట్‌రెడ్డి, తాళ్లపల్లి కృష్ణాగౌడ్, మాజీ రైల్వే ఉప్పతాధికారి భూక్యా కస్నానాయక్, జవ్వాజి నర్సింహారావు, మాజీ సర్పంచ్ గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ఈశ్వరలింగం, కవిత, పాల్గొన్నారు.

రాష్ట్రంలో గాడి తప్పిన పాలన

- లగచర్ల ఘటనకు సీఎం బాధ్యత వహించాలి
- కాంగ్రెస్ పాలనలో అధికారులకు రక్షణ కరువు
- ఫార్మాసిటీ పేరుతో గిరిజన రైతులకు అన్యాయం
- ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్

మహబూబాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పిందని, సీఎం రేవంత్‌రెడ్డి పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ విమర్శించారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్ల ఘటనకు రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణలోని కాంగ్రెస్ పాలనలో అధికారులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. హైదరాబాద్‌లో ఫార్మసిటీ కోసం మాజీ సీఎం కేసీఆర్ భూములు కొనుగోలు చేసినప్పటికి ప్రస్తుత రేవంత్‌రెడ్డి దానిని పక్కకు పెట్టి, తన సొంత జిల్లా, నియోజకవర్గంలో ఫార్మ కంపెనీలను పెట్టేందుకు గిరిజనుల భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వందేళ్లుగా భూమినే నమ్ముకుని జీవిస్తున్న గిరిజనులను ఆ భూములకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నించే వారిపై కేసులు పెడుతూ థర్డ్‌డిగ్రీ ప్రయోగించి, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, లగచర్లలో అరెస్టు చేసిన గిరిజన రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అసహనంతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి...

రాష్ట్రంలో పరిపాలన సీఎం చేతిలో లేదని, మంత్రులు ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు మాట్లాడుతున్నారని సత్యవతిరాథోడ్ అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక, ప్రజలకు ఏమిచేయలేక రేవంత్‌రెడ్డి అసహనంతో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. మూసీ నది ప్రక్షాళన పేరుతో అక్కడి ప్రజలను ఖాళీ చేయిస్తున్నారని, దానికి అడ్డు పడ్డవారిపై బుల్డోజర్లు ఎక్కిస్తామని సీఎం మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని, మాజీ సీఎంపై అనేక ఆరోపణలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఏ ఒక్కదానినైనా నిరూపించారా అని ప్రశ్నించారు.

ఢిల్లీకి కప్పం కట్టడంపై ఉన్న శ్రద్ధ..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఢిల్లీకి కప్పం కట్టడంపై ఉన్న శ్రద్ధ ప్రజలను కాపాడు కోవడంలో లేదని సత్యవతిరాథోడ్ ఆరోపించారు. 11 నెలల కాలంలో 25 సార్లు ఢిల్లీకిపోయి వచ్చారని, అంటే నెలకు రెండుసార్లు అక్కడికి పోవడమే సరిపోయిందన్నారు. లగచర్ల ఘటనపై సమీక్షించి సీఎం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలకు ఏటీఎంలా మారిందన్నారు. లగచర్లలో రైతులపై పెట్టిన కేసులు ఎత్తి వేయాలని అసలు ఈ ఘటనకు బాధ్యులైన సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలన్నారు. కుల గణన సర్వేకు తాము వ్యతిరేకం కాదని, ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా సర్వే ఉండకూడదన్నారు.

మహిళలకు సమాన హక్కులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నేదునూరి జ్యోతి

కురవి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ సమాజంలో సగభాగం కనుక.. ఆమెకు సమాజంలో సమాన హక్కులు, బాధ్యతలు కల్పించాలని భారత జాతీయ మహిళ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నేదునూరి జ్యోతి అన్నారు. కురవి మండల కేంద్రంలో మంగళవారం భారత జాతీయ మహిళ సమాఖ్య జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీ విముక్తి పోరాటాలు విజయవంతం కావాలని, అందులో మహిళలు క్రియశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. స్త్రీలను లక్షలాదికారులను చేస్తామంటున్న పాలకులు ముందుగా మహిళ పారిశ్రామిక వేత్తలను తయారు చేయాలని డిమాండ్ చేశారు. మద్య నిషేధాన్నిఅమలు చేసి. అశ్లీల సాహిత్యాన్ని, సమాచార వ్యవస్థను అరికట్టాలన్నారు. రాష్ట్ర నాయకురాలు ఏపూరి లతాదేవి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి, సీపీఐ మండల కార్యదర్శి కర్నం రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ ఫాతీమా, పద్మ, లక్ష్మి, రాణి, మాలి, హాలియా, మాధవి, భాగ్యమ్మ, రాజన్న, ఉపేంద్ర, వెంకటమ్మ పాల్గొన్నారు.

తూకంలో మోసాలకు పాల్పడితే
కఠిన చర్యలు
డీఆర్‌డీఏ అడిషనల్ ఏపీడీ జయశ్రీ
8

దేశ రాజకీయాల్లో ప్రత్యామ్నాయం ఎర్రజెండానే

- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య



సీపీఎం పట్టణ మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలతో ప్రజలు విసుగెత్తి పోయారని, దేశ రాజకీయాల్లో ప్రత్యామ్నాయం ఎర్రజెండానేనని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. మహబూబాబాద్ వర్తక సంఘం భవనంలో సూర్నపు సావిత్రమ్మ, వేల్పుల రమీల, కాసాని ఐలయ్య ప్రాంగణంలో సీపీఎం పట్టణ మహాసభను మంగళవారం నిర్వహించారు. సీనియర్ నాయకులు వెలిశాల బ్రహ్మచారి ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యవక్తగా ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరిగిపోయిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మునిసిపాలిటీపై ఎర్రజెండా ఎగురవేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. తొలుత సీపీఎం కార్యకర్తలు రెడ్‌షర్ట్‌లు ధరించి కవాతు నిర్వహించారు. ఈ మహాసభలో మునిసిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య, సమ్మెట రాజమౌళి, బానోత్ సీతారాంనాయక్, ప్రమీల, రాజు, హేమా, శ్రీనివాస్‌రెడ్డి, యాకయ్య, శ్రీను, రమాదేవి, నాగన్న, వెంకన్న, భాగ్యమ్మ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-3 నిర్వహణకు ఏర్పాట్లు

- జిల్లాలో 21 పరీక్ష కేంద్రాలు, ఎగ్జామ్ రాయనున్న 7,592 మంది అభ్యర్థులు
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

8

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ.. అనంతలోకాలకు

- వద్దెకొత్తపల్లి శివారులో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు
- ప్రమాదంలో తల్లి, కొడుకు దుర్మరణం



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు



శాంతమ్మ (ఫైల్)



వెంకన్న (ఫైల్)

పెద్దవంగర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బంధువుల అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, కొడుకు అనంతలోకాలకు చేరుకున్న ఉదంతం తొర్రూరు- వలిగొండ ప్రధాన రహదారిపై మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర వద్దె కొత్తపల్లి శివారులోని బ్రిడ్జివద్ద మంగళవారం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధి స్థానికులు వివరాల ప్రకారం. పెద్దవంగర మండలం అమర్‌సింగ్ తండాకు చెందిన జాటోతు శాంతమ్మ (63), జాటోతు వెంకన్న (48) వ్యవసాయం సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం తమ సమీప బంధువులైన సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం జలాల్‌పురం శివారులోని జేత్యానాయక్‌తండాలో అంత్యక్రియలకు ద్విచక్రవాహనంపై జాటోతు వెంకన్న, జాటోతు శాంతమ్మ తిరుగు ప్రయాణమయ్యారు. స్వగ్రామమైన అమర్‌సింగ్ తండాకు వస్తున్న క్రమంలో (తొర్రూరు వైపు నుంచి తిరుమలగిరి వైపు వెళ్తున్న) ఎదురుగా వస్తున్న టీఎస్ 09 జీపీ 5067ఇన్నోవా కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తల్లి, కొడుకు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటన స్థలాన్ని ఎస్సై క్రాంతికుమార్ పరిశీలించారు. జాటోతు వెంకన్నకు భార్య, ఇద్దరు కుమారులు, కుమారుడు, శాంతమ్మకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాలను శవపంచనామా నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలు కాగా, వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఉత్సాహంగా భద్రాద్రి జోన్ స్పోర్ట్స్ మీట్

విజేతలకు బహుమతులు అందించిన జడ్‌వో స్వరూపరాణి



వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

మరిపెడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి జోన్ 10వ స్పోర్ట్స్ మీట్ పోటీలు రెండో రోజు మంగళవారం మరిపెడ సోషల్ వెల్ఫేర్ గురుకుల స్కూల్‌లో ఉత్కంఠ భరితంగా సాగాయి. రెండోరోజు విజేతలకు జడ్‌వో స్వరూపరాణి మెమెుంట్లను బహుకరించారు.

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల పరిధిలోని 11 సోషల్ వెల్ఫేర్ గురుకులాల బాలుర జట్లకు అండర్ 14, 17, 19 విభా గంలో ఈ ఈవెంట్స్ ఉత్సాహభరితంగా నిర్వాహకులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రోజు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, క్యారమ్, చెస్, హైజంప్, లాంగ్‌జంప్, రన్నింగ్ పోటీలు విద్యార్థుల మధ్య హోరెత్తిం చాయి. ఈ పోటీలలో వివిధ గురుకుల పాఠశాలల నుంచి 935 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ దయాకర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివా స్‌రావు, పీడీ వంగ రవి, పీఈటీ వెంకటేశ్వర్లతో పాటు పోటీలలో పాల్గొనే ఆయా పాఠశాలల పీడీలు, పీఈటీలు, గైడ్, ఎస్కార్ట్ టీచర్లు, మీడియా ఇన్‌చార్జి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

కొనసాగుతున్న జోనల్ క్రీడలు

ములుగు (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం జోనల్ స్థాయి క్రీడలు ములుగు మండలం జాకారం సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. 11విభాగాలలో జరుగుతున్న పోటీలలో 950మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. రెండోరోజు మంగళవారం వివిధ క్రీడలలో ప్రతిభ కనబర్చిన వారు విజేతలుగా నిలిచారు. టెన్నికాయిట్ అండర్-14, 17లో జాకారం జట్టు విజేతగా నిలిచింది. చెస్ అండర్-14లో బెల్లంపల్లి, అండర్-19లో ఏటూరునాగారం విజేతలుగా నిలిచాయి. క్యారమ్స్ అండర్-19లో మంథని స్కూల్ విద్యార్థులు గెలుపొందారు. ఖోఖో-14లో మంథని జట్టు ప్రథమ విజేతగా నిలిచింది. పగలంతా ఆటలతో మైదానంలో సందడి నెలకొంటుండగా సాయంత్రం విద్యార్థులను ఉత్సాహ పరిచేందుకు క్యాంప్ ఫైర్ నిర్వహించారు. విద్యార్థుల కోసం వైద్యాధికారి సీహెచ్.రాములు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. క్రీడోత్సవాలను గురుకులం ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఆయా జిల్లాల డీసీవోలు భిక్షపతి, శ్రీనివాస్, యాదగిరి, వెంకటేశ్వర్లు పర్యవేక్షిస్తున్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గురుకులం విద్యార్థుల ప్రతిభ

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో గోల్డ్‌మెడల్

కాటారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండి యా (ఎస్‌జీఎఫ్‌ఐ) రాష్ట్ర స్థాయి పోటీల్లో కాటారం గిరిజన సంక్షేమ బాలుర గురుకులం విద్యార్థులు సత్తా చాటారు. హ్యాండ్‌బాల్ అండర్-19, అండర్-14 పోటీల్లో ప్రథమ స్థానంతో గోల్డ్ మెడల్స్ సాధించిన ఉమ్మడి వరంగల్ జిల్లా జట్లలో గురుకులం విద్యార్థులు తొమ్మిది మంది ఉన్నారు. అండర్-19 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన ఏడుగురి జట్టులో గురుకులానికి చెందిన కాటారం హ్యాండ్‌బాల్ అకాడమీ క్రీడాకారులు టి.జితేందర్, బి.వంశీ, బి. చందర్, బి.నరేష్, ఎం. సాయితేజ, జె.శేషు ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు కోచ్‌గా గురుకులానికి చెందిన వెంకటేశ్ వ్యవహరించగా టి.జితేందర్ కెప్టెన్‌గా వ్యవహరించి ఉత్తమ క్రీడాకారుడు అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ బి.లాల్ తెలిపారు.అలాగే హ్యాండ్‌బాల్ అండర్-14 విభాగంలో అత్యంత ప్రతిభతో గోల్డ్ మెడల్ సాధించిన జట్టులో గురుకులానికి చెందిన విద్యార్థులు బి.అజయ్, బి.దేవేందర్, ఎం.శ్రీధర్ ఉన్నారు. అత్యుత్తమ ప్రతిభతో గురుకులానికి మంచి పేరు తెచ్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ లాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్స్ రాజేందర్, మాధవి, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేశ్, అధ్యాపకులు వెంకటయ్య, బలరాం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల (టీజీవో) సంఘం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రఫీ కోరారు. ఇటీవల ఎన్నికైన టీజీవో జిల్లా కార్యవర్గం మంగళవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్‌కేకన్, అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, ఆర్డీవో కృష్ణవేణి, వివిధ శాఖల జిల్లా అధికారులను కలిశారు. ఈ సందర్భంగా టీజీవో జిల్లా అధ్యక్షుడు రఫి మాట్లాడుతూ.... తెలంగాణ గెజిటెట్ అధికారుల సంఘం భవన నిర్మాణ కోసం స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కొప్పు ప్రసాద్, వేముల సురేష్, హరిప్రసాద్, బి. రాజశేఖర్, డాక్టర్ నరేష్, పి. సదానందం, సోమ్లానాయక్, పి.రాజేంద్రప్రసాద్, గణేష్, శ్రీనివాస్, అఫ్సర్ పాషా, మున్వర్‌బేగ్, వీరన్న, జోత్స్న పాల్గొన్నారు.

విద్యార్థి దశలో చదువు ముఖ్యం

మరిపెడ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో చదువు ప్రధానమని మహబూబాబాద్ షీ టీం ఎస్సై సునంద అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్లంపేట హైస్కూల్‌లో విద్యార్థులకు ఏహెచ్‌టీయూ, భరోసా, సైబర్ క్రైమ్‌లపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బాలికల భద్రత షీ టీం లక్ష్యమన్నారు. పాఠశాలలో కాని ఇతర ప్రదేశాలలో ఆకతాయిలు బాలికలను భయాందోళనలకు గురి చేసినా, వేధించినా, ఇబ్బందికరంగా మాట్లాడినా వెంటనే వాట్సాప్ నెంబరు 87126 56935 కు సమాచారం అందివ్వాలన్నారు. ప్రయాణాలలో మహిళలు, విద్యార్థినీలు ట్రావెల్ షేప్ యాప్ (టీ సేప్)ని ఉపయోగి ంచాలన్నారు. సమాజంలో మహిళలు, బాలికలు తెలిసిన వారితోనే ఎక్కువ వేధింపులకు గురతున్నారని, అలాంటప్పుడు జాగ్రత్త పడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భాస్కర్‌రావు, షీ టీం సిబ్బంది పార్వతి, రమేష్, మరిపెడ పోలీసు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ఉమా మహేశ్వరరావు, రమేష్, శ్రీను, భరోసా సపోర్ట్ పర్సన్ బేబి పాల్గొన్నారు.



ఎల్లంపేట హైస్కూల్‌లో మాట్లాడుతున్న షీ టీం ఎస్సై సునంద

కేయూ తైక్వాండో మహిళా జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నవంబరు 11 నుంచి 15 వరకు అమృత్‌సర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ తైక్వాండో మహిళ జట్టును సోమవారం ఎంపిక చేసి నట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎం పికైన క్రీడాకారుల్లో శిరీష, ఎన్.తేజస్విని, (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశా ల, హనుమకొండ), కె.శ్రావణి, (వాగ్దేవి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్స్, వరంగల్), బి.రుద్ర (ఏకశిల డిగ్రీ కళాశాల, జనగామ), పి. నాగలక్ష్మి, (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చెన్నూరు), సీహెచ్, తులసి(నలంద డిగ్రీ కళాశాల, మహబూబాబాద్) ఉన్నట్లు వెల్లడించారు.

ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా మహబూబాబాద్ నలంద డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె. రమేశ్ వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులతో డైరెక్టర్ వెంకయ్య తదితరులు

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి

ఎంఎస్పీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ

గోవిందరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుప్రీంకోర్టు తీర్పు ను అమలు చేసి మాదిగలకు న్యాయం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్పీ) జాతీయ నేత మంద కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రాలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం దేశంలోనే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్య, ఉద్యోగ రంగాల్లో వర్గీకరణను అమలు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. వర్గీక రణ లేకుండానే డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాలను పక్కదారి పట్టించి మాది గలు అభివృద్ధి చెందకుండా మోసం చేశారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ విషయమై డిసెంబరు 21న హైదరాబాద్‌లో జరిగే మాదిగల ధర్మయుద్ధ మహా సభను నిర్వహిస్తున్నామని, జిల్లాలోని ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షు డిగా ఎనగందుల మొగిలయ్య, ప్రధాన కార్యదర్శిగా బొచ్చు అరవింద్, ఎంఎస్పీ అధ్యక్షుడిగా పసుల భద్రయ్య, అధికార ప్రతినిధిగా బుర్రి వెంకటేశ్, ఎంఎస్ఎఫ్ అధ్యక్షులుగా పెండ్యాల విజయ్, గంగారపు అశ్వనితేజ్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్, ఎంఎస్పీ జాతీయ నాయకుడు ఇరుగు పైడి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి కరు ణాకర్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పేరాల బలరాం, తోకల రాంబాబు, కొయ్యడ శ్రీకాంత్, నద్దునూరి రతన్, మచికలపూడి రతన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్ మాదిగ

ఇళ్లు నిర్మించాలని పేదల నిరసన

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

గోవిందరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని పేదలు మంగళవారం నిరసనకు దిగారు. ములుగు జిల్లా గోవిందరావుపేటలోని జాతీయ రహదారిపై సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పొదిళ్ల చిట్టిబాబు మాట్లాడుతూ పస్రాలోని సుందరయ్యనగర్‌లో గల 109సర్వే నంబర్‌లో 500మంది నిరుపేదలు నివస్తున్నారని, వారికి ప్రభుత్వం పట్టాలు అందించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా 109ఈ/అ సర్వే నంబర్‌లో పుల్యాల వసంత పేరుతో ఇచ్చిన అక్రమ పట్టాను రద్దు చేయాలన్నారు. దయ్యాలవాగు పరిసర ప్రాంతాల్లో ఉన్న వారికి ప్రభుత్వ భూమికొనుగోలు పథకం కింద ఇళ్లు నిర్మించి ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని, ప్రాజెక్టునగర్ ప్రజలకు ప్రభుత్వం సురక్షితమైన ప్రాంతంలో ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతర ఆర్ఐ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు అంబాల మురళి, గొంది రాజేష్, గుండు రామస్వామి, కడారి నాగరాజు, గుండు లెనిన్, కాప కోటేశ్వర్‌రావు, కందుల రాజేశ్వరి, మంచాల కవిత, గోపిశెట్టి ఐలయ్య, కృష్ణారావు, అరుణ్, జీవన్, వల్లపు రాజు, మంచోజు బ్రహ్మచారి, రాజేశ్వరి, సువర్ణ, శారద, సరిత పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పేదలు

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీ రకం)	2465	2080
పల్లికాయ (సూక)	5900	4000
పల్లికాయ (పచ్చిది)	---	---
కందులు	---	---
పెసళ్లు	6012	5900
పత్తి	7000	6300
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	11781	10023
పసుపు (గోల)	10806	4040
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	17000	14000
వండర్‌హాట్ ఏసీ	14200	11000
యూఎస్341ఏసీ	14000	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

పార్టీ బలోపేతం కోసం గ్రామస్థాయిలో కృషి చేయాలి

- యూత్, మహిళా నాయకులను ప్రోత్సహించాలి
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పార్టీ బలోపేతం కోసం నాయ కులు గ్రామస్థాయిలో కృషి చేయాలని పాలకుర్తి నియోజక వర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. తొర్రూరులోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో మంగళవారం పెద్దవంగర, తొర్రూరు మండలాల్లోని వివిధ గ్రామాల ముఖ్యకార్యకర్తలతో నిర్వ హించిన ఆత్మీయ సమ్మేళనంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ఎన్నికల్లో కార్యకర్తలు చేసిన కృషి అభినందనీయమన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలప ర్చిన అభ్యర్థి గెలుపుకోసం సైనికుల్లా నిలబడాలని, కార్యకర్తలకు ఏకష్టం వచ్చినా అండగా ఉంటామని తెలిపారు.

నియోజకవర్గంలో యూత్‌కు, మహిళా కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తూ వారిని ప్రోత్సహించాలని, స్థానిక ఎన్నికల్లో మహిళల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందన్నారు. కొత్త, పాత తేడా లేకుండా ప్రతి ఒక్కరు పార్టీ గెలుపుకోసం పనిచేయాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అందరికి అలాగే కృషి చేయాలన్నారు. ఇటీవల ప్రారంభించిన కులగణన బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగపడు తుందని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కులగణన చేపట్టి రిజర్వేషన్లు చేసి సామాజిక న్యాయాన్ని సంపూర్ణంగా ప్రభుత్వం అమలు చేస్తుం దన్నారు. కాంగ్రెస్ అగ్ర నేతలు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేస్తున్నారని, కార్యకర్తలే పార్టీకి పట్టు కొమ్మలు, అబద్ధపు ప్రచారాలు చేస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న ఇతర పార్టీ నాయ కులకు దిమ్మతిరిగేలా సమాధానం ఇవ్వాలని, సోషల్ మీడియాలో కో ఆర్డినేటర్‌లు ఉత్సాహంగా పని చేయాలన్నారు.

నవంబర్ 20వ తేదీ వరకు జరిగే ఈసర్వే విజయవంతంగా పూర్తయ్యేం దుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, పీసీసీ సభ్యుడు కె.నిరంజన్‌రెడ్డి, సోమేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు హమ్యానాయక్, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, పింగిళి ఉష, నాయకులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

స్టడీ

దూరవిద్యతోనూ ఉజ్వల భవిష్యత్

- అందరికీ అందించడమే లక్ష్యంగా ఎదిగిన ఎస్డీఎల్సీఈ
- ఆధునిక పద్ధతుల్లో బోధనకు కసరత్తు
- డిజిటల్ ఎడ్యుకేషన్ దిశగా అడుగులు



ఎస్డీఎల్సీఈ కేంద్రం

కేయూ క్యాంపస్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చారిత్రక కాకతీయ యూనివర్సిటీలోని దూరవిద్య కేంద్రం ఎంతో ప్రతిష్ఠాత్మమైందిగా పేరుతెచ్చుకుంది. పేద, మధ్య తరగతి వర్గాలకు ఉన్నత విద్యను అందించి వారి ఉజ్వల భవిష్యత్‌కు కృషి చేస్తోంది. 1989లో ఎంఫిల్ కోర్సుతో పురుడు పోసుకున్న కేయూ దూరవిద్య కేంద్రం ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ఎదిగింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న డిజిటల్ మోడ్ ఎడ్యుకేషన్‌ను కేయూ దూరవిద్య కేంద్రం పుణికిపుచ్చుకుని దేశంలోని అన్ని వర్సిటీలకు దీటుగా సేవలందిస్తోంది. దూరవిద్య కేంద్రం డైరెక్టర్ కేతవరపు రామకోటిశాస్త్రి మొదలు ప్రొఫెసర్లు మురళీ మనోహర్, వాసిరెడ్డి భాస్కర్‌రావు, కూరపాటి వెంకట నారాయణ, రవిప్రసాద్, రాజేంద్రప్రసాద్, ఎస్.లింగమూర్తి, చింతకాయల దినేశ్‌కుమార్, ఎస్.విజయ, ఎర్రగట్టు స్వామి, గుగులోత్ వీరన్న తదితర డైరెక్టర్లు ఈ కేంద్రానికి దశదిశను చూపారు. మారుతున్న కాలానికనుగుణంగా యూజీసీ డెబ్ (డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో) నూతన విధానాలను తీసుకొచ్చింది. దేశంలో ఉన్నత విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. రెగ్యులర్ కోర్సులతో పాటు దూరవిద్య కేంద్రం అందిస్తున్న కోర్సులకు సమాన ప్రాధాన్యం కల్పించింది. యూజీసీ డెబ్ తీసుకున్న నిర్ణయాలు దేశంలోని దూరవిద్య కేంద్రాలకు గుదిబండగా మారాయి. వెంకటేశ్వర వర్సిటీ దూరవిద్య విధానానికి అనుమతి రద్దు చేసింది.

అలాగే నాగార్జున వర్సిటీకి కొన్ని కోర్సులకు అనుమతి నిరాకరించింది. వీటితో పాటు అనేక వర్సిటీల దూరవిద్య కేంద్రాలకు అనుమతులను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో వరంగల్ ఎస్డీఎల్సీఈని కాపాడేందుకు ప్రస్తుత ఎస్డీఎల్సీఈ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉన్న కేంద్రాన్ని మూసివేయకుండా పునర్వైభవం తెచ్చేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టారు.

సెమిస్టర్ పుస్తకాల ముద్రణ

యూజీసీ డెబ్ నిబంధనల మేరకు ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ మొదటి సెమిస్టర్ కోర్సులకు ప్రామాణిక పుస్తకాలను ముద్రించింది. సైకాలజీ, ఇంగ్లిష్, సోషియాలజీ, సోషల్ వర్క్స్, సంస్కృతం, హిందీతో పాటు ఇతర అన్ని కోర్సుల పుస్తకాలను ముద్రించి విద్యార్థులకు అందిస్తోంది.

తరగతుల నిర్వహణ

కొవిడ్ కారణంగా పనిచేసుకుంటూ చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొనగా.. చదువుపై ఆసక్తి కలిగిన వారు పని చేసుకుంటూ ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు సాధిస్తున్నారు. తరగతులకు వెళ్లని వారికి పుస్తకాలు, పాఠ్యాంశాలు అశనిపాతంగా మారాయి. 2023-24 ఏడాది నుంచి తప్పనిసరిగా డిగ్రీ, పీజీ కోర్సుల్లో సెమిస్టర్ విధానాన్ని అనుసరించాలని నిబంధనలు పెట్టింది. గతంలోనూ సెమిస్టర్ బోధన చేయాలని చెప్పినా ఏడాదికేడాది సెమిస్టర్ విధానాన్ని వాయిదా వేస్తోంది. ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన జరుగుతోంది. ఏడాదిలో కోర్సులను బట్టి తరగతులు ఏర్పాటు చేస్తారు.

12 వేల మంది విద్యార్థులకు బోధన

దూరవిద్య కేంద్రంలో ప్రస్తుతం 12 వేల మంది విద్యార్థులకు యూజీ, పీజీతో పాటు ఇతర డిప్లొమా కోర్సుల్లో విద్య అందుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాల్లో స్టడీ సెంటర్లు ఉండగా యూజీసీ నిబంధనల మేరకు వర్సిటీ విస్తరించిన ఉన్న ప్రాంతాల్లోనే ఎస్డీఎల్సీఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలనే నిబంధనతో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ పరిధిలోనే స్టడీ సెంటర్లు, పరీక్షల కేంద్రాలను కుదించింది. ఒకప్పుడు దేశంలోని అన్ని ప్రాంతాల విద్యార్థులకు చాలా రకాల కోర్సులను అందించిన కేయూ దూరవిద్య కేంద్రం ప్రస్తుతం బీకాం, బీకాం కంప్యూటర్స్, ఎంఏ, ఎంఎస్సీ అందిస్తోంది. మొత్తం 33 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులను నిర్వహిస్తోంది. బీఏ, బీకామ్, బీఎస్సీ, ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో తదితర కోర్సులకు నిర్వహిస్తోంది.

ఇక నుంచి అంతా ఆన్‌లైన్‌లోనే..

కేయూ దూరవిద్య కేంద్రం పూర్తిగా ఆన్‌లైన్‌కి అప్‌గ్రేడ్ అవుతోంది. జనవరి మొదటివారంలో ఎస్డీఎల్సీఈ నూతన సాఫ్ట్‌వేర్ విధానాన్ని అనుసరించనుంది. వెబ్‌ను రూపొందించారు. ఎస్డీఎల్సీఈ డైరెక్టర్ వల్లూరి రామచంద్రం, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి ఆదేశాల మేరకు ఇప్పటికే అనుభజ్ఞులైన ప్రొఫెసర్లతో అన్ని విభాగాల పాఠ్యాంశాలు, వీడియో పాఠాలను రికార్డు చేసేందుకు ఆధునికి వీడియో ల్యాబ్‌ను ఎస్డీఎల్సీఈలో అందుబాటులోకి తెచ్చారు. ఒక్కసారి వీడియో, ఆడియో పాఠాలను రికార్డు చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తే విద్యార్థులకు వీలైనప్పుడు చూడవచ్చు. దూరవిద్యలో అడ్మిషన్లు, సర్టిఫికెట్ల జారీ, సమస్త సేవలను ఆన్‌లైన్‌లోనే అందిస్తామని డైరెక్టర్ రామచంద్రం వెల్లడించారు. అలాగే ట్రాకింగ్ సిస్టంను అందుబాటులోకి తేనున్నారు. దీంతో తమ దరఖాస్తులు ఏ దశలో ఉన్నాయి. తమకు ఎస్డీఎల్సీఈ సేవలు ఎప్పుడు లభిస్తాయో తెలుసుకునే వీలు కలుగుతోంది.

ఎస్డీఎల్సీఈలో అన్ని కోర్సులకు అనుమతి

వల్లూరి రామచంద్రం, కేయూఎస్డీఎల్సీఈ డైరెక్టర్



ఎంఏ తెలుగు, సైకాలజీతో పాటు బీఏ కోర్సులకు యూజీసీ డెబ్ నిబంధనల మేరకు అన్ని అర్హతలున్నా కోర్సులకు అనుమతులు తీసుకువచ్చాం. విద్యా రంగంలో వస్తున్న డిజిటల్ టెక్నాలజీ, స్వయం పోర్టల్ కోర్సుల నేపథ్యంలో కేయూ దూరవిద్య కేంద్రాన్ని ఎప్పటికప్పుడూ అప్‌గ్రేడ్ చేస్తున్నాం. విద్యార్థులకు నాణ్యమైన, ప్రామాణిక విద్యను అందిస్తున్నాం. దూరవిద్య కోర్సులన్నీ రెగ్యులర్ విద్యకు సమానమని యూజీసీ నిర్ణయించిన నేపథ్యంలో పాత పద్ధతులు పోయి నూతన విధానాలను తీసుకువస్తుంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం. కేయూ ఎస్డీఎల్సీఈకి పునర్వైభవం తీసుకొస్తాం.

కేయూ ఎస్డీఎల్సీఈకి అంతర్జాతీయ గుర్తింపు

వరంగల్ కేయూ దూరవిద్య కేంద్రం అంతర్జాతీయ గుర్తింపు పొందింది. యూజీ, పీజీ కోర్సులతో పాటు దేశంలోని ఏ వర్సిటీలో లేని ప్రొఫెషనల్ కోర్సులను అందించింది. న్యాయశాస్త్రం, ఎడ్యుకేషన్ అందించింది. ఇక్కడ చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో అత్యున్నత ఉద్యోగాలు పొందారు. దూరవిద్య సెలబస్ ప్రామాణికంగా ఉంటుందని గుర్తింపు లభించింది. ఎస్డీఎల్సీఈలో చదివిన విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్-1, 2 అధికారులు, టీచర్లు, పోలీసులు, లాయర్లు, ఇతర ఉద్యోగాలు సాధించి ప్రజలకు సేవలందిస్తున్నారు.

డిగ్రీ అడ్మిషన్‌కు తప్పనిసరి ఇంటర్

కేంద్ర ప్రభుత్వం యూజీసీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డెబ్) డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లకు తప్పనిసరిగా ఇంటర్/తత్సమాన విద్యార్హతను నిర్ణయించింది. గతంలో ప్రత్యేక పరీక్షలు నిర్వహించి డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పించే విధానానికి స్వస్తి పలికారు. రెగ్యులర్/ ఓపెన్ ఇంటర్ చదివిన విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తున్నారు. దూరవిద్య కేంద్రంలో డిగ్రీ కోర్సుల్లో చదివే వారి సంఖ్య పడిపోతుంది. అలాగే వర్సిటీ పరిధిలోని జిల్లాల్లోనే స్టడీ సెంటర్లతో పాటు పరీక్షల కేంద్రాల ఏర్పాటు చేయాలనే నిబంధనలు వర్సిటీ దూరవిద్య కేంద్ర అభివృద్ధికి అటంకంగా మారాయి. గతంలో వందల సంఖ్యలో స్టడీ సెంటర్లు వేలాది సంఖ్యలో ఉన్న విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో 44 స్టడీ సెంటర్లు ఉన్నాయి.

రావమ్మా మహాలక్ష్మి..

ఆడబిడ్డకు పూలబాటతో స్వాగతం



కేసముద్రం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వారికి తొలుత ఇద్దరు కుమారులు జన్మించారు. కానీ అమ్మాయి కావాలన్న ఆకాంక్ష నెరవేరకపోవడంతో ఆ దంపతులు మూడోసంతానం కోసం వేచిచూశారు. ఈ క్రమంలో మూడో సంతానంగా అమ్మాయి జన్మించడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తమ కుటుంబంలోకి 'మహాలక్ష్మి' ఆడపిల్ల రూపంలో వచ్చిందని ఆ దంపతులు, కుటుంబసభ్యులు పూలబాట వేసి స్వాగతం పలికారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లికి చెందిన పొడకంటి క్రాంతికుమార్, సుమ దంపతులకు ఈనెల 10న మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో ఆడపిల్ల జన్మించింది. మంగళవారం సుమ డిశ్చార్జి అయి కూతురితో తమ ఇంటికి రాగా కుటుంబస భ్యులు పూలబాట ఏర్పాటు చేసి 'రావమ్మా మహాలక్ష్మి' అంటూ ఆ శిశువుకు స్వాగతం పలకడం విశేషం. ఆడపిల్లపై అంతలా ప్రేమానురాగాలు చూపిస్తున్న ఆ కుటుంబాన్ని చూసి పలువురు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

రైట్.. రైట్.. పోనియ్ బాస్..
కోతుల పని పడదాం



కోతుల నుంచి పంటలను కాపాడుకునేందుకు కేసముద్రం మండలం కల్వలకు చెందిన రైతు ఆకుల సుధాకర్ కొన్నేళ్లుగా కొండెంగను పెంచుతున్నాడు. కొండెంగను చెల్కవద్దకు తీసుకువెళ్లగానే పంటపొలాల పరిసర ప్రాంతాల్లో ఉన్న వానరాలు కంటికి కానరాకుండా పారిపోతున్నాయి. దీంతో ఆయన నిత్యం కొండెంగను ఇంటి నుంచి చెల్క వద్దకు ఇలా బైకుపై తీసుకువెళుతుంటాడు. ఈ క్రమంలో ఆ కొండెంగ కూడా సుధాకర్ పిలవగానే 'రైట్.. రైట్ పోనియ్ బాస్... కోతుల పని పడదాం.. పదా..' అన్నట్టుగా బైకుపై వెనుక కూర్చోవడం అలవాటు చేసుకుంది. రోజులాగే మంగళవారం కొండెంగను చెల్కవద్దకు తీసుకెళుతూ కనిపించారు సుధాకర్.

- కేసముద్రం, ఆంధ్రజ్యోతి

కానిస్టేబుళ్లకు అతి ఉత్కృష్ట సేవా పతకాలు


మల్లారెడ్డి


మహేశ్

హనుమకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు కేంద్ర ప్రభుత్వం అందజేసే అతి ఉత్కృష్ట సేవా పతకానికి కేయూసీ పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న మల్లారెడ్డితోపాటు హనుమకొండ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కె.మహేశ్‌లు ఎంపికయ్యారు. అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైన మల్లారెడ్డి దామెర మండలం కొగిలివాయి గ్రామానికి చెందినవారు. 1990లో పోలీసు కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరి గూడూరు, కొత్తగూడ, సంగెం, సుబేదారి పోలీసు స్టేషన్లలో పని చేసి పోలీసు జిల్లా అధికారుల నుంచి పలు రివార్డులు, ప్రశంసాపత్రాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సేవ, ఉత్తమ సేవా పతకాలను మల్లారెడ్డి అందుకున్నారు. అలాగే హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన మహేశ్ 1996లో కానిస్టేబుల్‌గా చేరి సీసీఎస్, మిల్స్‌కాలనీ, జనగామ పోలీసు స్టేషన్లలో సమర్థవంతంగా విధులు నిర్వహించి అధికారుల నుంచి పలు రివార్డులతోపాటు జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాలను అందుకున్నారు. అతి ఉత్కృష్ట సేవా పతకాలకు ఎంపికైన మల్లారెడ్డి, మహేశ్‌లను పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా అభినందించారు.

పట్టుదలే ఆమె మనోధైర్యం


డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ

- పేదరికాన్ని అధిగమించి రాణించిన యాకమ్మ
- ఇంటర్‌లో వివాహమైనా నిత్యవిద్యార్థిగా ఎదిగిన పేద మహిళ
- ఉపాధ్యాయురాలిగా విధులు.. సాహితీ రంగంలోనూ గుర్తింపు

స్ఫూర్తి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టుదల... కృషి.. సమయస్ఫూర్తి ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని రుజువు చేశారు నిరుపేద దళిత మహిళ డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ. మహబూబాబాద్ పట్టణానికి చెందిన రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబంలో జన్మించిన యాకమ్మ.. తన తల్లిదండ్రులు అబ్బయ్య, అబ్బమ్మ పడిన కష్టాలను చూస్తూ పెరిగారు. ఎలాగైనా చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తల్లిదండ్రుల స్తోమతకు తగ్గట్టుగా ఆమె ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నారు. గుమ్మడూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1వ నుంచి 5వ తరగతి వరకు, స్థానిక బాలికోన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేశారు. అయితే ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు పూర్తికాగానే తల్లిదండ్రులు 1996లో మహబూబాబాద్ పట్టణానికి చెందిన సోమారపు వీరస్వామితో వివాహం చేశారు. మే నెలలో ఇంటర్ ఫలితాలు రాగా యాకమ్మ ఇంగ్లీష్‌లో ఫెయిల్ అయింది. వెంటనే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసిన యాకమ్మ ఉత్తీర్ణత సాధించారు. ఈ క్రమంలో యాకమ్మకు చదువుపై ఉన్న శ్రద్ధ, ఆసక్తిని గమనించిన భర్త వీరస్వామి ఆమెను ప్రోత్సాహించారు. అదేసమయంలో ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సీటు రాగా.. ఆమెతో పాటు అక్కడే గది అద్దెకు తీసుకుని ఆయన ఆటోడ్రైవర్‌గా ఉంటూ ఆమెను చదివించారు. అలా 1996-1999లో డిగ్రీ పూర్తిచేసిన ఆమె 1999-2000 విద్యాసంవత్సరంలో తెలుగు పండిట్‌లో ప్రవేశం పొంది హన్మకొండ ప్రభుత్వ బీఈడీ కళాశాలలో పండిట్ కోర్సు పూర్తిచేశారు. 2000-2002లో కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ తెలుగులో పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తిచేశారు. 2001లో నిర్వహించిన డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికయ్యారు. 2002 సంవత్సరం చేపట్టిన ఉపాధ్యాయ నియామకాల్లో కురవి మండలంలోని కాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా విధుల్లో చేరారు. అయినా ఆమె పట్టుదలతో నిత్యవిద్యార్థినిగా రాణించారు. కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ బన్న ఐలయ్య ప్రోత్సాహం, ఆశిస్సులతో పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులను పూర్తిచేశారు. తమిళనాడు మధురై కామరాజ్ యూనివర్సిటీలో 2005 సంవత్సరంలో ఎంఫిల్ పట్టా అందుకున్నారు. 2013లో స్టేట్ ఎలిజిబిలిటి టెస్ట్(సెట్), 2014లో నేషనల్ ఎలిజిబిలిటి టెస్ట్(నెట్)కు అర్హత సాధించారు. 2016లో ద్రవిడ యూనివర్సిటీ కుప్పంలో పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. 2017లో కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ (సంస్కృతం) పూర్తిచేశారు. ఆమె కూతురు గాయత్రి ఎంబీబీఎస్ కాకతీయ మెడికల్ కళాశాలలో పూర్తి చేశారు. కుమారుడు కళ్యాణ్ హైదరాబాద్ ఎంజీఐటీలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్నారు. ఇంటర్‌లో ఫెయిలైనా నిరుత్సాహ పడకుండా చదువే జీవితంగా పట్టుదలతో ఉన్నత శిఖరాలను అందుకున్న యాకమ్మ నేటి మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పత్ర సమర్పణలు చేశారు.


యాకమ్మను సన్మానిస్తున్న కలెక్టర్ శశాంక, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు (ఫైల్)

ముద్రించిన పుస్తకాలు

2017లో బోయ జంగయ్య సాహిత్య అనుశీలన, 2018లో మమతల మల్లెలు-కథల సంపుటి, 2019లో జగడం ఒక పరిశీలన, 2020లో కెరటం దళిత నవల, రక్షణ కథల సంపుటి, 2021లో మట్టిబంధం కవితా సంపుటి, 2022లో దుఃఖనది కరోనా కథలు.

అందుకున్న అవార్డులు..

యాకమ్మ చదువులోనే కాదు సాహితీ రంగంలో కూడా తనదైన ముద్ర వేశారు. అనేక కథలు, కవితలు, నవలలు, రచనలు చేసి అవార్డులు అందుకున్నారు. 2017లో మదర్ ఫౌండేషన్ వరంగల్ సేవా రత్న జాతీయ అవార్డు, కాలగమనం కథకు అక్షరాలతోవకు జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి, 2018లో అక్షర శిఖరం కవితలకు జాతీయస్థాయి పురస్కారం, 2019లో బిఎస్ రాములు ప్రతిభా పురస్కారం, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, కెరటం నవలకు ద్వితీయ బహుమతి, మమతల మల్లెలు కథా సంపుటికి డాక్టర్ పుట్ల హేమలత స్మారక పురస్కారం, సాహితీరత్న పురస్కారం, సాహితీసేవ పురస్కారాలు, 2022లో రాష్ట్ర ఉత్తమ రచయిత అవార్డు, కలెక్టర్, ఎంపీల చేతుల మీదుగా ఉత్తమ రచయిత అవార్డు, మంత్రి సత్యవతిరాథోడ్, కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ కవితా పురస్కారం, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, 2023లో నందివాడ రత్నశ్రీ, పర్సా సైదులు స్మారక పురస్కారాలు, జాతీయస్థాయి కవితల పోటీల్లో ప్రథమ బహుమతి పురస్కారం, వెన్నెల గొడుగు కవితకు జాతీయస్థాయి ఉత్తమ కవిత పురస్కారం, 2024లో కెరటం నవలకు ఉత్తమ గ్రంథ ప్రతిభా పురస్కారం అందుకున్నారు.

స్వయం ఉపాధితో.. సాధికారత వైపు

- ఉపాధి రంగంలో సుస్థిరత కోసం మహిళల ముందడుగు
- యూనిట్ల ఏర్పాటులో ఇల్లంద మహిళల ముందంజ
- జిల్లా, రాష్ట్రస్థాయిలో పురస్కారాలు
- రుణాల మంజూరులో ఏపీఎం, సీసీల తోడ్పాటు
- ఉమ్మడి జిల్లా ఓరుగల్లు సమాఖ్య పదవుల్లోనూ ఇక్కడి మహిళలే..
- చైతన్యం చాటుతున్న ఇల్లంద అతివకు గవర్నర్ ప్రశంస

స్ఫూర్తి


రజితను ప్రశంసిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ (ఫైల్)

మహిళా సంఘాలకు గవర్నర్ ప్రశంస

వరంగల్ జిల్లాలో ఉన్న స్వయం సహాయక మహిళా సంఘాలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. ఇటీవల వరంగల్‌లో జరిగిన సెర్ప్ డైరెక్టర్లు, బ్యాంకు రాష్ట్రస్థాయి అధికారులకు నిర్వహించిన సద స్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఇల్లందకు చెందిన కొంగ రజితకు మాట్లాడే అవకాశం వచ్చింది. ఉపాధిలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్న రజి తను సెర్ప్ సీఈవో సంపదీప్ సుల్తాన్యా చేతుల మీదుగా సైతం గతంలో రాష్ట్రస్థాయి స్త్రీ శక్తి అవార్డును వర్ధన్నపేట మండలం సొంతం చేసుకుంది. ఇలా జిల్లా, రాష్ట్ర స్థాయిలో వరంగల్ జిల్లా స్వయం సహాయక సంఘాలు ముందంజలో ఉండడం అధికారులు, మహిళల సమన్వయం, చైతన్యమే కారణంగా చెప్పుకుంటున్నారు.

వర్ధన్నపేట రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. ఉద్యోగాలు చేయడం గొప్పగా భావిస్తున్న సమయంలో వారే యజమానులుగా మారి మరో పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తూ మహిళా లోకానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం తోడవడంతో మరింత మెరుగైన ఉపాధి మార్గాలను ఎంచుకుంటున్నారు. కుటీర పరిశ్రమల నుంచి వ్యవసాయం, పాడి, ఆధునిక సాంకేతిక ఉపాధి వైపు మళ్లుతున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు కేవలం పొదుపు చేయడం, రుణాలు తీసుకోవడంతోనే సరిపెట్టకుండా తమ కాళ్లపై తాము నిలదొక్కుకునేలా ఉపాధికి బాటలు వేసుకునేందుకు ప్రభుత్వం పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా అవకాశాలు కల్పిస్తోంది. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఈ అవకాశాలను వినియోగించుకోవడంలో ముందంజలో ఉందనే చెప్పాలి.

ఎస్‌హెచ్‌జీ (సెల్ఫ్ హెల్ప్ గ్రూప్) బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు పొందడంలో సైతం ప్రభుత్వ లక్ష్యానికి దగ్గరగా పని చేస్తున్నారు. జిల్లాలో 11 మండలాలకు గాను 11,438 స్వయం సహాయక సంఘాలు ఉండగా, 435 గ్రామైఖ్య సంఘాలున్నాయి. ఈ సంఘాల్లోని మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన మైక్రో ఎంటర్ ప్రైజెస్ (విలేజ్ న్యూ ఎంటర్‌ప్రైజెస్) పేరుతో ప్రత్యేకంగా వ్యాపారాల ఏర్పాటుకు రుణాలు అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది 6352 మందిని లక్ష్యంగా నిర్ణయించగా వందశాతం స్వయం సహాయకులను గుర్తించి యూనిట్లు అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

మహిళల ముందంజ..

వర్ధన్నపేట మండలం ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధిస్తోంది. ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో 427 యూనిట్లకు గాను ఇప్పటికే 300 మందికి పైగా అందించారు. ఇక రూ. లక్ష నుంచి రెండు లక్షల వరకు ఇచ్చే ఇందిరా మహిళా శక్తి పథకంలో సైతం ముందంజలో ఉన్నారు. ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలను ఈ ఏడాది రూ. 45 కోట్ల టార్గెట్ పెట్టగా, రూ.18 కోట్ల రుణాలు అందించడంతో పాటు మరో 15 కోట్ల వరకు ప్రాసెస్‌లో ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇక మండలంలోని ఇల్లందలో పీఎంఈజీపీ పథకం కింద దాదాపు 10మందికి పైగా రూ.10 లక్షల రుణాలు అందించడంలో అధికారులు సఫలీకృతమయ్యారు. వర్ధన్నపేట ఏపీఎం వేణు, సీసీ గోలి కొమురయ్యలు బ్యాంకు మేనేజర్లతో స్వయంగా మాట్లాడి మహిళలను ప్రోత్సహించడంలో సత్ఫలితాలు సాధిస్తున్నారు.

అధ్యక్ష స్థానాల్లోనూ పెద్దపీట

ఉమ్మడి జిల్లా మహిళా సంఘాల అధ్యక్ష స్థానాల్లోనూ వర్ధన్నపేట మండలం తనదైన ముద్రను వేసుకుంటోంది. మొట్ట మొదటిగా సారిగా ఉమ్మడి జిల్లా మహిళా సమైఖ్య సంఘానికి, ప్రస్తుత మునిసిపాలిటీ కౌన్సిలర్ తోటకూరి రాజమణి అధ్యక్షురాలిగా వ్యవహరించారు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లా ఓరుగల్లు మహిళా సమైఖ్య అధ్యక్షురాలిగా ఇల్లంద గ్రామానికి చెందిన ఎడ్ల అరుణ వ్యవహరిస్తున్నారు.

గతంలో వరంగల్ జిల్లాకు కడారిగూడెం గ్రామానికి చెందిన చెన్న సమ్మక్క, గోలి రజితలు వ్యవహరించారు. ఇలా ప్రతిసారి ఉమ్మడి, జిల్లా స్థాయిలో వర్ధన్నపేట మండలానికి పెద్ద పీట వేస్తూ మహిళలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారు.


రాష్ట్రస్థాయి స్త్రీ శక్తి అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న ఇల్లంద మహిళలు (ఫైల్)

పీఎంఈజీపీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గోలి కొమురయ్య, సీసీ, ఇల్లంద



ఇల్లంద గ్రామ మహిళల్లో ఉపాధి మార్గం ఎంచుకోవాలనే తపన ఉంది. దీని ద్వారా ఉత్పత్తులు, సర్వీస్ అందించే కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాం. ఈ క్రమంలో పలు ఉత్పత్తుల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయించాం. కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, రెడీమెడ్ గార్మెంట్స్, ఫొటో స్టూడియో, ఇంటర్‌నెట్ సెంటర్, ఆయిల్ మిల్లు, పిండి గిర్ని వంటి వాటిని ఏర్పాటు చేసే విధంగా ప్రోత్సహించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహిళల్లో చైతన్యం నింపడం సంతోషంగా ఉంది.

మహిళలు ఆర్థిక సాధికారత దిశగా నడవాలి

వేణు, ఐకేపీ ఏపీఎం, వర్ధన్నపేట



మహిళలు ఆర్థిక సాధికారత దిశగా నడవాలి. ఉపాధి మార్గాల్లో మెరుగైన యూనిట్‌ను ఎంచుకుని ఆర్థికంగా ఎదగాలనేదే మా ఆలోచన. ఇందు కోసం జిల్లాస్థాయి నుంచి గ్రామీణ స్థాయి వరకు అధికారులు, మహిళా సంఘాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. డీఆర్డీఏ పీడీ, ఏపీడీ, డీపీఎం అధికారుల సహకారంతో వర్ధన్నపేట మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీ కింద రుణాల లక్ష్యాన్ని కూడా అందుకుని మహిళలను ఆర్థికంగా బలోపేతమయ్యేలా చేస్తాం.

నెలకు రూ.60 వేలు సంపాదిస్తున్నా

కె.రజిత, కంప్యూటర్ ఎంబ్రాయిడర్, ఇల్లంద



గతంలో నేను మిషన్ కుట్టేదాన్ని. 2009లో మణికంఠ మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరి పొదుపులు, రుణాలు తీసుకునేదాన్ని. కానీ మారిన ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలను తీసుకువచ్చాయి. ఆ వివరాలను తెలుసుకుని స్వయం ఉపాధి కోసం కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ షాపు పెట్టాలనుకున్నా. పీఎంఈజీపీ స్కీంలో 35శాతం సబ్సిడీతో రూ.10లక్షల లోన్ మంజూరైంది. ఇప్పుడు నెలకు రూ.40వేల నుంచి 60వేల వరకు సంపాదించడంతో పాటు మరో ముగ్గురికి ఉపాధి కల్పిస్తున్నా.

మహిళలను చైతన్యం చేస్తున్నా..

ఎడ్ల అరుణ, ఓరుగల్లు మహిళా సమాఖ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు



ఈ ఏడాది నిర్వహించిన మహిళా సమాఖ్య ఎన్నికల్లో ఇల్లంద నుంచి నాకు ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలిగా అవకాశం దక్కింది. బృందావన మండల సమాఖ్య అధ్యక్షురాలిగా ఉన్న నేను అందరి ప్రోత్సహించడంతో ఈ పదవి చేపట్టా. నిత్యం మహిళలను చైతన్య వంతులను చేయడంలో ముందుంటా. ఇప్పటికే ఉపాధి మార్గాలు ఎంచుకోవడంతో పాటు ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా నిర్వహిస్తున్నా.

ప్రశాంతంగా గ్రూప్-3 నిర్వహణకు ఏర్పాట్లు : కలెక్టర్



మహబూబాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1 (జనరల్‌స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్) పరీక్ష ఉంటుందని, అరగంట ముందే ఉదయం 9.30 గంటలకే పరీక్ష కేంద్రం గేట్లు మూసివేస్తారని చెప్పారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు పేపర్-2 (హిస్టరీ అండ్ పొలిటి అండ్ సొసైటీ) పరీక్ష ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకే గేటు మూసివేస్తారని చెప్పారు. ఈనెల 18న మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 వరకు పేపర్-3 (ఎకానమి అండ్ డెవలప్‌మెంట్) పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటల లోపు చేరుకోవాలన్నారు. మహబూబాబాద్ జిల్లాలో 7,592 మంది అభ్యర్థులు గ్రూప్-3 పరీక్షలు రాస్తున్నారని, వీరికోసం 21 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో దివ్యాంగ అభ్యర్థుల కోసం రెండు గదులను కేటాయించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, రీజినల్ కోఆర్డినేటర్ బలరాంనాయక్ పాల్గొన్నారు.

పక్కాగా సర్వే నిర్వహించాలి..

ప్రతీ ఇంటిని సందర్శిస్తూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో సర్వేపై మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సగటున ప్రతిరోజు 15 ఇండ్లను సందర్శిస్తూ, సర్వే ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలన్నారు. ఇప్పటి వరకు పూర్తయిన సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, అధికారులు పురుషోత్తం, సుబ్బారావు, హరిప్రసాద్, నర్మద పాల్గొన్నారు.



మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

స్కూల్లో మాక్ పోలింగ్

కొత్తగూడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడ ట్రైబల్ వెల్ఫేర్ మోడల్ స్పోర్ట్స్ స్కూల్లో మంగళవారం ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ బూత్, బ్యాలెట్ పేపర్, పోలీసు బందోబస్తు నమూనాలను ఏర్పాటు చేసి ఓటర్లుగా విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏటీడీవో భాస్కర్, హెచ్ఎం డి.సారయ్య, రేగా పాపయ్య, వాసం వీరస్వామి, వెంకటయ్య, సుబ్బారావు, సరస్వతి పాల్గొన్నారు.

తూకంలో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

● డీఆర్‌డీఏ అడిషనల్ ఏపీడీ జయశ్రీ

మహబూబాబాద్ రూరల్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యం తూకంలో మోసం చేస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ అడిషనల్ ఏపీడీ జయశ్రీ హెచ్చరించారు. పర్వతగిరిలో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ కొనుగోలు సెంటర్ ఇంచార్జులు ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులకు అందుబాటులో ఉంటూ వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఆమెవెంట తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఏపీఎం తిలక్, కొనుగోలు సెంటర్ నిర్వాహకులు నారాయణసింగ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

నెల్లికుదురు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామన్నగూడెంలో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం తొర్రూరు ఆర్డీవో గణేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుక రావాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని నిర్వహ కులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, గిర్దావర్ అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

దగా చేసిన మాజీ సీఎం కేసీఆర్ : సీపీఐ



కేటీఆర్ ఆవిష్కరించిన పైలాన్ చుట్టూ నల్ల వసతిం చుట్టి నల్లజెండాలతో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మానుకోట మునిసిపల్ అభివృద్ధికి మాజీసీఎం కేసీఆర్ రూ.50 కోట్లు నిధులిస్తున్నామని చెప్పి, దగా చేశారని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యదర్శి బి.విజయసారథి విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ రూ.50 కోట్లు నిధులిస్తామని చెప్పి మోసం చేయడాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలో మాజీ మంత్రి కేటీఆర్ ఆవిష్కరించిన రూ.50 కోట్ల పైలాన్‌కు నల్ల వస్త్రం చుట్టి అక్కడ నల్లజెండాలతో మంగళవారం వినూత్న నిరసన చేపట్టారు. అందుకు సంబంధించి జీవో నెంబరు 34 ప్రతులకు నల్ల సిరాభిషేకం చేశారు. ఈ సందరంగా విజయసారథి మాట్లాడుతూ... మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి కేటీఆర్ పదేళ్ల కాలంలో మానుకోట జిల్లాలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మునిసిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్‌ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, నర్రా శ్రావణ్, మాలోతు రవీందర్, మహమూద్, అశోక్, ప్రవీణ్, చిరంజీవి, చిదిరాల జ్ఞానేశ్వర్, రాజకుమారి, మంద శంకర్, హర్షవర్ధన్, నక్క నాగార్జున, మల్లయ్య, వికాస్, భద్రయ్య, పాల్, రవిచంద్రబోస్, సత్యం, రాజేష్, లక్ష్మణ్‌పామర్, మురళీ, రమేష్ పాల్గొన్నారు.

'వర్గీకరణను వెంటనే అమలు చేయాలి'

కేసముద్రం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని చేపట్టాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కంటిపూడి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కేసముద్రంలో మంగళవారం నిర్వహించిన సంఘ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలను మోసం చేశారని ఆరోపించారు. ఈనెల 16న సంఘం మండల కమిటీని ఎన్నుకుంటామని తెలిపారు. సమావేశంలో మూరగుండ్ల యాదగిరి, బిర్రు యుగేందర్, మూరగుండ్ల గాలయ్య, కంటిపూడి వెంకన్న, జల్లె హరీష్, యాకయ్య పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



కలెక్టర్ అద్వైత్‌కమార్‌సింగ్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న జర్నలిస్టులు

మహబూబాబాద్ టౌన్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) స్టేట్ హౌస్ సైట్స్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు బండి సంపత్ కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిత్తనూరి శ్రీనివాస్, గాడిపెల్లి శ్రీహరి కోరారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసము ద్రం మండల కేంద్రంలో అనేక ఏళ్లుగా అర్హులైన జర్నలిస్టులు తమ ఇళ్ల స్థలాల కోసం అధికారులకు, ప్రజాప్రతినిధులు విజ్ఞప్తులు చేశారని చెప్పారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వేల్పుల రాజేశ్వర్‌రావు, రామాచారి, యాకూబ్‌రెడ్డి, రాములు, రాము, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● డిజిటల్ మీడియా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ (డీఎంజేయూ) జాతీయ గౌరవ అధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్‌జిల్లా కేంద్రంలో ఈనెల 17న జరుపతలపెట్టిన సంఘం ఆవిర్భావసభ కరపత్రాలను స్థానిక ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముతేష్, సీఎస్.రావు, కె.రాజేంద్రప్రసాద్, బొడ్డు అశోక్, సాంబయ్య, పవన్, మహేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు : గిరిజన జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ట్రైబల్ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లావుడ్య రాము, జిల్లా అధ్యక్షుడు తేజావత్ రవి అన్నారు. తొర్రూరులో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. గిరిజన జర్నలిస్టులు లకావత్ యాదగిరి, జాటోత్ బాలాజి, గుగులోత్ రవి, లింగానాయక్, రాజేందర్ ఉన్నారు.

వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



కలెక్టరేట్ ఎదుట వీవోఏల ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇందిరా కాంతి పథం (ఐకేపీ)లో పని చేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీవోఏ)లను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. వీవోఏలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ ఐకేపీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సాధికారిత, ప్రభుత్వ పథకాల అమలు కోసం పాటుపడుతున్న ఐకేపీ వీవోఏలకు నెలకు కనీస వేతనం రూ.20 వేలు చెల్లించాలని కోరారు. అనంతరం డీఆర్‌డీఏ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెలిశాల సుధాకర్, జిల్లా అధ్యక్షురాలు నీలం కృష్ణవేణి, ఆకుల వసంత, గుగులోతు హన్మంతు, అనిత, ఉమ, మంజుల, కృష్ణకుమారి, శ్రీను, మనోహర్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కురవి పోలీసులు

• తప్పిపోయిన మహిళను కుటుంబసభ్యులకు అప్పగింత



మహిళను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న ఎస్సై సతీష్

కురవి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో సమస్యలతో మతిస్థిమితం కోల్పోయి ఆరునెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళను కురవి పోలీసులు పట్టుకుని కుటుంబసభ్యులకు అప్పగించి మానవత్వం చాటుకున్నారు. ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన రేఖ సమ్మక్క (60) ఇంట్లో గొడవలతో ఆరునెలల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో ఆమె కుమారుడు రేఖ వెంకన్న ఫిర్యాదు మేరకు కురవి పోలీసులు సమ్మక్క కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మహబూబాబాద్‌లోని రైల్వేస్టేషన్ నుంచి గుర్తు తెలియని రైలుఎక్కి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మొరదబాద్ చేరుకుందని తెలుసుకున్నారు. ఉన్నతాధికారులకు తెలిపిన ఎస్సై సతీష్ వారి ఉత్తర్వులతో కురవి పీఎస్ నుంచి హెడ్ కానిస్టేబుల్ ఉపేందర్, ఉమెన్‌పీసీ అనిత, పీసీ రమేష్‌లను ఉత్తర్‌ప్రదేశ్‌కు పంపించారు. అక్కడ మొరదబాద్ హోంలో ఉన్న సమ్మక్కను మెజిస్ట్రేట్‌ముందు హాజరుపరిచి స్వగ్రామానికి తీసుకువచ్చారు. మంగళవారం అయ్యగారిపల్లిలో కుటుంబ సభ్యులకు అప్పగించారు. 6నెలల తర్వాత సమ్మక్కను కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎస్సై సమ్మక్కకు నెలరోజులకు సరిపడ నిత్యావసర వస్తువులను అందించారు. పోలీసులను డీఎస్పీ తిరుపతిరావు, సీఐ సర్వయ్య అభినందించారు.

'విశ్వబ్రాహ్మణ కులంగా గుర్తించాలి'

మహబూబాబాద్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చేతి వృత్తుల వారు (కమ్మరం, వడ్రంగం, ఇత్తడి, శిలాశిల్పం, స్వర్ణకారులు) అందరిని ఒకే కులం విశ్వబ్రాహ్మణ కులంగా గుర్తించి కులగణనలో నమోదు చేసుకోవాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కోశాధికారి మోత్కూరి శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. చేతి వృత్తులను దాయి పరంగా విడదీసి విశ్వబ్రాహ్మణులను రిజర్వేషన్ పరంగా అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

యాకమ్మకు ఉత్తమ గ్రంథ పురస్కారం



యాకమ్మను సన్మానిస్తున్న కేవీరమణాచారి, వైస్‌చాన్స్‌లర్ నిత్యానందరావు, కిషన్‌రావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని డాక్టర్ ఎన్టీఆర్ కళామందిర్ తెలుగు విశ్వవిద్యాలయంలో మంగళవారం జిల్లా కేంద్రానికి చెందిన కవి, రచయిత్రి తాళ్లపల్లి యాకమ్మను ఉత్తమ గ్రంథ పురస్కారంతో ఘనంగా సన్మానించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతీ సంవత్సరం అందిస్తున్న ప్రతిష్ఠాత్మక పురస్కారాల్లో భాగంగా 2024 సంవత్సరానికిగాను రచయిత్రి డాక్టర్ యాకమ్మ రచించిన కెరటం నవలకు ఉత్తమ గ్రంథ పురస్కారంతో డాక్టర్ ఎన్టీఆర్ కళామందిర్ తెలుగు విశ్వవిద్యాలయంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య వెల్దండ నిత్యానందరావు, డాక్టర్ కె.వి.రమణాచారి, ఆచార్య తంగేడు కిషన్‌రావు ప్రశంసా పత్రం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

గార్ల నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సీహెచ్‌సీ ఆసుపత్రి వెనుక భాగంలో విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. స్థానిక అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన సింగం నాగేశ్వరరావు చెందిన గేదెలు ఆసుపత్రి వెనుక భాగంలో మేత మేపుతుండగా, ఆక్సిజన్ ప్లాంట్‌కు అమర్చిన విద్యుత్ వైర్లకు తగిలి గేదె అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఘటన స్థలానికి పశు వైద్యాధికారి సురేష్ చేరుకొని పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు గేదెను అప్పగించారు. మృతి చెందిన గేదె విలువ సూమారు రూ.70వేలు ఉంటుందని నాగేశ్వరరావు తెలిపారు.

వేతనాల మంజూరుకు కృషి చేయాలి

గార్ల నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చాలిచాలని వేనాలతో కాలం వెళ్లదీస్తూ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదని విటీ విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుక పోయి వేతనాలు మంజూరీకి కృషి చేయాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు మంగళవారంగ్రామ పంచాయతీ కార్మికులు సీఐటీయూ పక్షాన వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాస్, సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పిరెడ్డి, దాను, రమేష్, శ్రీను పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ బహూకరణ

కురవి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బలపాల ప్రాథమిక పాఠశాలకు అదే పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థి హార్డ్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న కొప్పుల రవికుమార్ ఎల్ఈడీ టీవీని బహుమానంగా అందించారు. ప్రముఖ సైక్రియాటిస్ట్ దేవులపల్లి కేశవరావు సూచనతో తనతండ్రి కొప్పుల వెంకన్న జ్ఞాపకార్థం పాఠశాలకు టీవీని అందించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం తేలుకుంట్ల సునీత, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం నర్సింహారెడ్డి, సీఆర్పీ ఉమ పాల్గొన్నారు.

నేడు సీపీఎం మండల మహాసభ

కురవి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాజోలులో కురవి మండల 8వ సీపీఎం మహాసభను నిర్వహిస్తున్నట్లు మండల కార్యదర్శి మలేడి కోటయ్య మంగళవారం తెలిపారు. చల్లగొల్ల లక్ష్మీనగర్‌లో పిట్టల దర్గయ్య ప్రాంగణంలో నిర్వహించే మహాసభలో జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, కార్యదర్శివర్గ సభ్యులు ఆకుల రాజు పాల్గొంటారని తెలిపారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మృతుడి కుటుంబానికి రెడ్యా పరామర్శ

కురవి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కురవి మండలం బలపాలలో మృతి చెందిన బత్తుల ముత్తయ్య చెందాడు. విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ బలపాల చేరుకుని ముత్తయ్య మృతదేహం వద్ద నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. రెడ్యా వెంట బీఆర్ఎస్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, తోట లాలయ్య, నామ సైదులు, బత్తుల వెంకన్న, రొయ్యల నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై సర్వే ఒత్తిడిని తగ్గించాలి

కొత్తగూడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర సర్వేలో ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి ఉందని, దీన్ని తగ్గించేందుకు మరింత సమయాన్ని ఇవ్వాలని కోరుతూ కొత్తగూడ ఎంపీడీవో కార్యాలయంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల సాంబయ్య, మండల అధ్యక్షుడు తీగల రమేష్, ప్రధాన కార్యదర్శి మేడ నర్సింహారావు పాల్గొన్నారు.

'సర్వే ఎన్యూమరేటర్లపై ఒత్తిడి పెంచొద్దు'

మరిపెడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుల గణన చేస్తున్న ఎన్యూమరేటర్లపై అధికారులు ఒత్తిడి పెంచొద్దని టీపీటీఎఫ్ మరిపెడ మండల కమిటీ బాధ్యులు హఫీజర్, పవన్‌కుమార్, మహేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వారు మరిపెడ ఎంపీడీవోకు వినతి పత్రం ఇచ్చి స్థానిక విలేకరులతో మాట్లాడారు. ట్రైనింగ్‌లో లేని నిబంధనలతో సర్వే పర్యవేక్షణ అధికారులు కొత్త రూల్స్ పెట్టి ఎన్యూమరేటర్లను వేధిస్తున్నట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. రోజు ఐదు కుటుంబాల సర్వేకే టైం సరిపో తుందని సర్వే గడువు పెంచాలన్నారు.

ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన

మరిపెడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఓటుహక్కు ప్రాముఖ్యతపై మరిపెడ బంగ్లాలోని సెయింట్ ఆగస్టీన్ స్కూల్ విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ దీనా మాట్లాడారు. విద్యార్థులకు ఓటు హక్కుపై అవగా హన కలిపించారు. 18ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు కావాలని సూచించారు. కార్యక్రమంలో సిస్టర్ ప్రాన్సీ, నిబిన్, జపమాల, పూజ, ధనమ్మ, షాహిదా, విజయ, రవి, సుమన్ పాల్గొన్నారు.

నెల రోజులుగా తెరుచుకోని పశువైద్యశాల

● ఇబ్బందులు పడుతున్న పాడి రైతులు

తొర్రూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చివరిగా 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న నాంచారిమడూరు గ్రామ పశువైద్యశాల నెల రోజులుగా తెరుచుకోవడం లేదు. సోమారం, హరిపిరాల, నాంచారి మడూరు గ్రామాల్లో పశువైద్యశాలలో ఎల్ఎస్ఏలు విధులు నిర్వహిస్తుంటారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 4 గంటల వరకు గ్రామంలోని రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాల్సి ఉంటుంది. ఇటీవల కాలంలో జరిగినబదిలీల్లో భాగంగా నాంచారిమడూరు గ్రామానికి జూలై 26న ఎల్.ఎస్.ఏ (లైవ్‌స్టాక్ అసిస్టెంట్) వరప్రసాద్ వచ్చారు. విధులు నిర్వహిస్తున్న క్రమంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి అక్టోబరు 4న డిప్యూటేషన్‌పై తిరిగి వెళ్లారు. దీంతో గతనెల రోజులుగా పశు వైద్యశాల తెర్చుకోవడం లేదని రైతులు వెల్లడిస్తున్నారు. ఆస్పత్రి పరిధిలో వెల్లికట్టె, నాంచారిమడూరు, గుడిబండతండా, జామ్లాతండా, బోజ్యాతండాలకు చెందిన వెయ్యికి పైగా గొర్రెలు, గేదెలు, పశువులు ఉన్నాయి. సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంతో పశువులకు ఏమైనా వ్యాధి సోకితే రైతులు పాడిపశువులను తీసుకొని తొర్రూరుకు వెళ్లాల్సి వస్తుందంటున్నారు. దీంతో దూరభారంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో ఆస్పత్రి కొనసాగేలా చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై తొర్రూరు పశువైద్యాధికారి మాధవిని వివరణ కోరగా.. గత నెలలో బదిలీపై వచ్చిన ఎల్ఎస్ఏ డిప్యూటేషన్‌పై పంపించారని, హరిపిరాల ఎల్ఎస్ఏకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. సమయం దొరికినప్పుడు వచ్చివెళ్తుతారని వివరించారు.



నాంచారిమడూరులో తాళం వేసి ఉన్న పశువైద్యశాల

సంక్షిప్త వార్తలు



కల్వలలో క్షేత్ర పరిశీలనలో పాల్గొన్న వరంగల్ కళాశాల వ్యవసాయ విద్యార్థినులు

విద్యార్థినుల క్షేత్ర పరిశీలన

కేసముద్రం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వలలో ప్రకృతి విధానంలో సాగుచేసే రైతు గంట దామోదర్ రెడ్డి పంటపొలాలను వరంగల్ కళాశాల బీఎస్సీ అగ్రికల్చర్ (హానర్స్) చివరి సంవత్సర విద్యార్థినులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి సాగు చేస్తున్న వివిధ రకాల పంటలు, ప్రకృతి సాగు విధానాన్ని విద్యార్థినులకు వివరించారు. విద్యార్థినులు బి.అనూష, జి.కావేరి, బి.దీప్తి, జి.దివ్య, ఎన్.కీర్తి, కె.దీప, ఎన్.మధుశ్రీ, కె.అభినయశ్రీ, బి.దివ్యాంశి, రజిత పాల్గొన్నారు.

'వర్కర్లకు న్యాయం చేయాలి'

తొర్రూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు న్యాయం చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తొర్రూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్మికులు గ్రామాల్లో సేవ లు అందిస్తున్నా ప్రభుత్వం గుర్తించడం లేదని గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. నాయకులు పాద్య బీకూ, సోమనర్సయ్య, బుచ్చిలింగం, లింగమూర్తి, యాకయ్య, ప్రవీణ్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇనుగుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన గంజి వసంతకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.56 వేలు, పోతరబోయిన సతీష్‌కు రూ.31,500 చెక్కులను మంగళవారం కాంగ్రెస్ గ్రామపార్టీ అధ్యక్షుడు గంజి రాజేందర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి చిన్నాల కట్టయ్య, దేవులపల్లి వెంకన్న, కుంచాల రమేష్, కొంతం రాములు, ప్రభాకర్ పాల్గొన్నారు.

'రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ ధ్యేయం'

మరిపెడ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ సర్పంచ్ నూకల అభినవ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పురుషోత్తమాయ గూడెంలో ఐకేపీ ఆధ్వర్యంలో చేసిన గ్రామసమైక్య సంఘం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు మేలు కోరే ప్రభుత్వమన్నారు. వివిధ గ్రామాల్లో దళారులకు ధాన్యం విక్రయించి నష్టపో వద్దన్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాలలో విక్రయించినట్లయితే నాణ్యమైన ధరతో పాటు క్వింటా వడ్లకు రూ.5వందల బోనస్ ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వీరాసింగ్, ఎపీఎం రాములు, గుండగాని బాబు గౌడ్, పటేల్ దుర్గయ్య, రాము, రామ్మూర్తి, శ్రీనివాసచారి, రాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



విద్యార్థినికి రక్త పరీక్షలు జరుపుతున్న ఆర్‌బీఎస్‌కే వైద్యులు

మరిపెడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మరిపెడ హైస్కూల్ విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే వైద్యులు మంగళవారం రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత ఉన్న పిల్లలకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. పౌష్టికాహారంపై అవగాహన కలి పించారు. డాక్టర్ సౌజన్య, హెచ్ఎం అనంతరావు, జనవి జ్ఞాన వేదిక మండల బాధ్యులు రాంమోహన్, స్కూల్ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

● సీఐ పెండ్యాల దేవేందర్

మహబూబాబాద్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించి, పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ అన్నారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అమ్మపేరుతో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ప్రజా హృదయం స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో టౌన్ పోలీస్‌స్టేషన్‌కు పూలు, షో సంబంధించిన 50 రకాల మొక్కలను సీఐ దేవేందర్‌కు మంగళవారం హరిత మిత్ర అవార్డు గ్రహీత ధైద వెంకన్న అందించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మొక్కల పెంపకం ద్వార అంతరించి పోతున్న అడవులను కాపాడిన వారమవుతామని చెప్పారు.

'టీచర్లపై ఒత్తిడిని తగ్గించాలి'



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

తొర్రూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రారంభించిన కులగణన సర్వేలో పైఅధికారులు చేస్తున్న ఒత్తిడిని తగ్గించాలని టీపీటీఎఫ్ తొర్రూరు మండల అధ్యక్షుడు కె. జనార్దన్, కార్యదర్శి కొలుపుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తొర్రూరులో ఎంపీడీవో నర్సింగరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొంటున్నారని, ప్రతిరోజు పూర్తిచేసిన ఫామ్స్ అదే రోజు అందజేయాలని, 15 నుంచి 20 కుటుంబాల సర్వే ఒకేరోజు పూర్తి చేయాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. నాయకులు స్వామి, సునిత, ప్రవీణ్ కుమార్, సతీష్, లింగం ఉన్నారు.